జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



# ఈ హై మాకొద్దు...!





**✳ 23 ఏళ్లుగా ఒకరే యూనియన్ లీడర్ ✳ లీడర్‌పై తిరుగుబాటు ఎగురవేసిన సభ్యులు ✳ ఏకపక్ష నిర్ణయాలపై మూకుమ్మడి వ్యతిరేకత ✳ సంఘాన్ని రాజకీయంగా వాడుకుంటుందని విమర్శ ✳ అంగన్‌వాడీ కార్యకర్తల వ్యక్తిగత వ్యవహారాల్లో తలదూర్చడంపై సర్వత్రా ఆందోళన**

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 20 (వార్త):** ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మధ్య అగ్గి రాజుకుంది. 23 ఏళ్లుగా ఒక్కరే యూనియన్ లీడర్‌గా చెలామణి అవుతుండడంతో ఇన్నాళ్లు నివురు గప్పిన నిప్పులా ఉండే యూనియన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. లీడర్‌గా ఉంటూ కార్యకర్తల వ్యక్తిగత వ్యవహారాల్లో తలదూర్చి ఇబ్బందులకు గురి చేస్తుందని కార్యకర్తలకు ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్‌లో రాజకీయ కార్యకలాపాలకు వాడుకుంటుందని తమల్ని బలిపశువులుగా మారుస్తుందని ఆవేదనకు గురయ్యారు. దీంతో తామంతా ఆ లీడర్ మాకొద్దు అంటూ తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. ఈ మేరకు గాంధీ పార్క్‌లో అంగన్వాడి కార్యకర్తలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. ఇచ్ఛాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 270 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. గతంలో అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 70 అంగన్వాడీ కేంద్రాలు, 7 సెక్టార్లు ఉన్నాయి. గతంలో ఉన్న రూరల్ ఐసిడిఎస్, అర్బన్ ఐసిడిఎస్ రెండింటిని కలిపి ఇచ్ఛాపురం ప్రాజెక్టుగా ఉంచారు. 70 కేంద్రాలకు లీడర్‌గా బెల్లుపడకి చెందిన కార్యకర్త బర్ల హైమావతిని ఎన్నుకున్నారు. అప్పటి నుంచి 23 ఏళ్లుగా ఎటువంటి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా హైమావతి లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. రెండు ప్రాజెక్టులు కలిపిన తర్వాత ఇటీవల జరిగిన ఎన్నికల్లో పురుషోత్తపురంనకు చెందిన ధనపాన సుబ్బలక్ష్మి యూనియన్ నాయకురాలు పదవి కోసం పోటీ చేశారు. కానీ తిరిగి హైమావతినే మరోమారు ఎన్నుకున్నారు. సిఐటియు అనుబంధంగా కొనసాగుతున్న యూనియన్‌లో అందరూ సంఘటితంగా పోరాటం చేసి ఐకమత్యంగా డిమాండ్లు సాధించుకునేవారు. కానీ గత కొంతకాలంగా హైమావతి ప్రవర్తనలో మార్పు వచ్చిందని, కార్యకర్తల వ్యక్తిగత వ్యవహారాల్లో తలదూర్చి లేనిపోని అవాకులు చవాకులు, పీతురిలు చెబుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా యూనియన్‌ను రాజకీయ కార్యకలాపాలకు వాడుకుంటుందన్నారు. తమకు ఏ ప్రభుత్వం వచ్చినా ఒకటేనని తాము 40 రోజులు ధర్నా చేసినప్పటికీ తమ జీతాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే ప్రాజెక్టులో సెక్టర్ల మధ్య, సెంటర్లో కార్యకర్త ఆయాల మధ్య చిచ్చు పెడుతుందని, లేనిపోని ఇబ్బందులకు గురిచేసి మానసికంగా ఆందోళనకు గురి చేస్తుందని అన్నారు. దీంతో విసిగి వేసారి యూనియన్ నాయకురాలిని మార్చాలని ఒక్కటయ్యారు. సమావేశంలో 132 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు.. ఈ యూనియన్ నాయకురాలు మాకు వద్దు అంటూ సంతకాలు చేశారు. ఇదే విషయం యూనియన్ జిల్లా నాయకులు దృష్టికి తీసుకువెళ్లి వెంటనే నాయకత్వం మార్పు చేయాలని కోరారు. ఈ సమావేశంలో దనపన సుబ్బలక్ష్మి, పుల్లెల విజయలక్ష్మి, జయలక్ష్మి పట్నాయక్, బాలమణి, జయమ్మ, కుండల సురేఖ, తెల్లి హారిక, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇదే విషయమై యూనియన్ లీడర్ హేమావతి విలేకరులకు వివరణ ఇస్తూ ప్రాజెక్టు మీటింగ్ పేరుతో పిలిచి సంతకాలు చేశారని, సంతకాల్లో కొన్ని ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని దీని వెనక అధికారుల పాత్ర ఉందని అన్నారు.



# ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**-ఈ నెల 23 నుంచి మార్చి 31 వరకు అవకాశం**

**-జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 20(వార్త):** ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో గల 13 ఆదర్శ పాఠశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు కలవో ఆ పాఠశాలల్లోనే ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 2025 - 26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత కలిగిన విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశానికి www.cse.ap.gov.in/apms.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రవేశ రుసుం రూ.125లు, బీసీ విద్యార్థులు ప్రవేశ రుసుం రూ.200లు మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత ఆదర్శ పాఠశాల ప్రధానాచార్యులను సంప్రదించాలని ఆయన కోరారు. మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం



**కవిటి, ఫిబ్రవరి 20(వార్త):** కూటమి ప్రభుత్వంతోనే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమని పలువురు నేతలు పేర్కొన్నారు. కవిటి పీఏసీఎస్ అధ్యక్షుడు బాసుదేవ్ ప్రధాన్ ఆధ్వర్యంలో శీలగం రోడ్ నుంచి గోవిందపుట్టుగ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు పొందల కృష్ణారావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సీపాన వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ తదితరులు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన మౌలిక సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చి మౌలిక సౌకర్యాల కల్పనలో అగ్రస్థానంలో నిలపడం ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్‌కు ఘనత దక్కుతుందన్నారు. అనేక మారుమూల గ్రామాలను బయట ప్రపంచానికి కలిపే విధంగా రోడ్ల నిర్మాణం చేపట్టి ఆయా గ్రామాల ప్రజల్లో ఆనందం చూస్తున్నామన్నారు. త్వరలో అటు దూగాన పుట్టుగ నుంచి పెద్ద తాత ఆలయం మీదుగా గోవిందపుట్టుగ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి ఎన్నో ఏళ్ల నాటికల కూటమి ప్రభుత్వం నెరవేర్చబోతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు సదానందరౌలో వాసుదేవ్ రౌలో, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల చినబాబు, ఐటీడీపీ ప్రతినిధి పుల్లట రాజు, దోగానుపుట్టుగ, మెలియాపుట్టుగ తదితర గ్రామాల నుంచి టీడీపీ, కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో దాసునాయుడు



**సారవకోట, ఫిబ్రవరి 20(వార్త):** తల్లి గ్రామంలో నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు హాజరయ్యారు. గ్రామస్తులు మెండ దాసునాయుడుకు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆంజనేయస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజల ఐక్యత కోసం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. మహోత్సవంలో గ్రామ పెద్దలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా కొనసాగింది.

## పాఠశాలలను పరిశీలించిన ఎంఈఓలు

**-చెన్నైవలస, కృష్ణాపురంల్లో విద్యా ప్రమాణాల సమీక్ష**



**జలుమూరు, ఫిబ్రవరి 20(వార్త):** చెన్నైవలస, కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు వాసుదేవరావు, కృష్ణారావులు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల చదవు సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు, రికార్డులు, వర్క్ బుక్లను సమగ్రంగా పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అదనపు బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహారం అందిస్తున్నారా అనే విషయాన్ని తెలుసుకున్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు.

## కిసాన్ డ్రోన్ సేవలను వినియోగించుకోండి

**- డ్రోన్ మాట్ యాప్ ద్వారా స్ప్రేయింగ్ సేవల బుకింగ్**

**-ఏడీ వెంకట మధు**

**నరసన్నపేట, ఫిబ్రవరి 20(వార్త):** ప్రయాణాలకు ఉబర్, క్యాబ్ సేవలు బుక్ చేసుకున్నట్లే ఇప్పుడు రైతులు కిసాన్ డ్రోన్ సేవలను కూడా సులభంగా బుక్ చేసుకోవచ్చని నరసన్నపేట వ్యవసాయ శాఖ ఏడి వెంకట మధు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న డ్రోన్ సేవల గురించి వివరించారు. రైతులు ప్లే స్టోర్‌లో "డ్రోన్ మాట్" యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన వివరాలు నమోదు చేసి డ్రోన్ సేవలను బుక్ చేసుకోవచ్చున్నారు. యాప్‌లో తేదీ, సమయం, గ్రామం, పంట రకం, ఏ మందు స్ప్రే చేయాలి వంటి వివరాలను నమోదు చేయాలని సూచించారు. రైతుల అవసరానికి అనుగుణంగా డ్రోన్ ద్వారా పంటలకు స్ప్రేయింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ విధానంతో సమయం, ఖర్చు తగ్గడంతో పాటు సమర్థవంతమైన వ్యవసాయ పనులు నిర్వహించవచ్చున్నారు. రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# సోంపేటను హడలెత్తిస్తున్న ట్రాఫికర్!

**-విస్తరణకు నోచుకోని రోడ్లు**

**-ప్రయాణికులకు ఇక్కట్లు**

**-పట్టించుకోని పాలకులు**

**- అభివృద్ధికి**

**ఆమడ దూరంలో పట్టణం**



**సోంపేట, ఫిబ్రవరి 20(వార్త):** ట్రాఫిక్ సమస్య సోంపేటను హడలెత్తిస్తోంది. ప్రభుత్వాలు మారినా పాలకులు మాత్రం స్పందించకపోవడంతో సోంపేట అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. దశాబ్దాలుగా అతి ప్రధాన సమస్య అయిన ప్రధాన రహదారి విస్తరణ ఇప్పటికీ నోచుకోకపోవడం ఈ ప్రాంతీయుల దురదృష్టం. జిల్లాలో ప్రతి మండల కేంద్రంలోనూ ప్రధాన రహదారులు ఎంతో అద్భుతంగా విస్తరించి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యం కల్పించినప్పటికీ అటు జిల్లా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ సోంపేట విషయంలో మౌనం దాల్చడంపై ఆంతర్యం ఏమిటో అంతు చిక్కడం లేదు. ఇటువంటి నిర్లక్ష్యంతో ఇరుకైన ప్రధాన రహదారి నిత్యము రద్దీగా మారి వాహనాలు సక్రమంగా వెళ్లలేని పరిస్థితి ప్రజలకు తీవ్ర సమస్యగా మారింది. మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలు...ఆసుపత్రులు.... వ్యాపారాలు మొదలైన అవసరాలపై బయట ప్రాంతాల నుంచి నిరంతరం వచ్చే వేలాదిమంది ప్రజలకు ఇక్కడ ట్రాఫిక్ సమస్య ప్రాణ సంకటంగా మారింది. విపరీతమైన జనాభా దానికి తోడు కళాశాలలకు రాకపోకలు సాగించే వందలాది మంది విద్యార్థులు ఉదయం సాయంత్రం వేళల్లో పశువుల మందల గుంపులు, జనాభాకు మించి వాహనాలు రాకపోకలు ఇక్కడ ట్రాఫిక్ జామ్‌పై నిరంత రం విమర్శలు కురిపిస్తున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే పరిస్థితి సక్రమంగా లేకపోవ డంతో వాటి వెనుక విపరీతంగా వాహనాలు నిలిచిపోయి పరిస్థితి రోజురోజుకు తీవ్రతరం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్ ఆర్అండ్‌బీ శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపిన ప్రతిపాద నలు ఏమాత్రం అమలుకు నోచుకోకుండా బుట్ట దాఖల య్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలో 20 నెలలైనా ఈ విష యంలో కనీస ప్రయత్నం జరగలేదని స్థానికులు నేతలు తీరుపై విమర్శిస్తున్నారు. ఎన్నికల ముందు అభివృద్ధిపై అనేక ఉపన్యాసాలు చేసిన పెద్దలు అధికారం దక్కిన తర్వాత హామీల అమలును పట్టించుకోకపోవడం దారుణ మని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా సోంపేట మెయిన్ రోడ్డుకు నిధులు సాధించి విస్తరణ చేపట్టి ప్రజలకు సౌక ర్యం చేకూర్చాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# మందస పూర్వ విద్యార్థుల దాతృత్వం

**-హైస్కూల్‌కు బెంచీలు వితరణ -పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఫౌండర్ ప్రొఫెసర్ మోహనాచారి కృషి అభినందనీయం**



**మందస, ఫిబ్రవరి 20(వార్త):** మందస హైస్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ వారు సుమారు రూ.90వేలతో 60 డెస్క్ బెంచీలను శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావుకు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మందసలోని ఈ స్కూలు పూర్వ విద్యార్థులు స్కూల్ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతుండడం అభినందనీయమన్నారు. నిధులను సమీకరించిన ప్రొఫెసర్ మోహనాఆచారి చేస్తున్న కృషి ఎంతో ఆదర్శప్రాయమైనదన్నారు. పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు గిన్ని తిరుపతిరెడ్డి, ప్రభాకర్ పట్నాయక్, కిశోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదల చూపిస్తే ఒక సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థానాన్ని అధిరోహించగలరన్నారు. ఈ స్కూల్లో చదువుకొని అనేకమంది అనేక రంగాలలో ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు కూడా చదువుపై శ్రద్ధ పెట్టి ఈ స్కూల్ చరిత్రని నిలబెట్టాలని కోరారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తమ పూర్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఎంపీటీసీ కంచి బెహరా, మల్లారెడ్డి హేమరాజు, దున్న హరికృష్ణ మాట్లాడుతూ హైస్కూల్ పూర్వ విద్యార్థి పట్నాల మోహనాచారి దాతృత్వంతో హైస్కూల్ బాయ్స్, గర్ల్స్ టాయిలెట్లు మరమ్మతులు చేయించి, తన ఉదారతను చాటుకున్నారన్నారు. ఎస్ఎస్సీ పరీక్షల నిర్వహణ సందర్భంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు నూతనంగా తయారు చేసిన ఈ డెస్క్ బెంచీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యా ర్థులు చేసిన ఈ విధమైన సహాయం మరోమారు చరిత్రలో నిలుస్తుందన్నారు. డాక్టర్ మోహనా ఆచారి ఈ సమావేశాన్ని ఉద్దేశించి వాయిస్ మెసేజ్ ద్వారా తన సందేశాన్ని అందించడం విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో ఆనందాన్ని అందించింది. ప్రతి విద్యార్థి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటారని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు అప్పలకొండ పంచదార్ల (రూ.116లు), కొర్రాయి పాపారావు (రూ.516లు), గణేష్ సాహు(రూ.6వేలు), వడ్డి చంద్రశేఖరం(రూ.వేలు), బత్తుల వీరభద్రరావు(రూ.5వేలు), బలివాడ ధనలక్ష్మి(రూ.5వేలు), కిల్లంశెట్టి కరుణ(రూ.వేలు), మందస జమీందారి మనవడు విశాల్ సింగ్ దేవ్(రూ.5వేలు), కర్రి పాపారావు(రూ.వేలు), గిన్ని తిరుపతిరెడ్డి(రూ.వేలు), మామిడి కోదండరావు(రూ.2వేలు), మట్ట ధర్మారావు(రూ.2వేలు), మనోహర్ ఆచారి(రూ.4వేలు), దేవి ప్రసాద్ బమ్మిడి (రూ.2వేలు), చిరంజీవి రౌతు(రూ.1వేలు), దున్న హరికృష్ణ (రూ.1వేలు), రమేష్ చంద్ర బారికో(రూ.3వేలు), బలివాడ సుధారాణి (రూ.2వేలు), సుధాకర్ పట్నాయక్(రూ.1వేలు), దిలీప్ కుమార్ పాణిగ్రాహి (రూ.1వేలు), నీలకంఠం ముక్కాన (రూ.1వేలు), ప్రభాకర్ కేవి శర్మ (రూ.వేలు), వీకేకే పట్నాయిక్(రూ.1వేలు), కళ్యాణ్ పట్నాల (రూ.2వేలు) మోహనాచారి(రూ.21,445వేలు) అందజేశారు. సుమారు 90వేల రూపాయల దాతృత్వంతో నిర్మాణం చేసిన 60 డెస్క్ బెంచీలను పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో హెచ్ఎం శ్రీనివాసరావుకు అందజేశారు.

అనంతరం సమర ఎస్ఎంఆర్ ఫౌండేషన్ వారు, విద్యార్థినీ విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను, టీచర్స్‌కు స్నాక్స్ అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, సురేంద్ర చంద్రపండా తదితరులు పాల్గొన్నారు.



## నరసన్నపేట ఉపాధి పనులపై

## అధికారుల సంతృప్తి

**- ప్రజా వేదికలో డ్వామా ఫైనాన్స్ మేనేజ్మెంట్ అధికారి స్వరూప సమీక్ష**



**నరసన్నపేట, ఫిబ్రవరి 20(వార్త):** నరసన్నపేట మండలంలో గత ఏడాది చేపట్టిన ఉపాధి హామీ పనులపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా డ్వామా ఫైనాన్స్ మేనేజ్మెంట్ అధికారి స్వరూప సమీక్ష నిర్వహించారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో అమలైన ఉపాధి పనులు, కూలీలకు చెల్లించిన వేతనాలు, పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఆర్పి సమగ్ర నివేదికను ఆమెకు సమర్పించారు. పనుల అమలు తీరుపై సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసిన స్వరూప, భవిష్యత్తులో కూడా పారదర్శకంగా, సమయానికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శైలజ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

**- నారాయణ వలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ-2 పేడాడ దాలినాయుడు**



**నరసన్నపేట, ఫిబ్రవరి 20(వార్త):** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని ఎంఈఓ-2 పేడాడ దాలినాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం నరసన్నపేట మండలం నారాయణ వలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదవు, వ్రాయు, గణిత నైపుణ్యాలను పరిశీలించి, వారి ప్రగతిని తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, మౌలిక సదుపాయాలను కూడా సమీక్షించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మెరుగ్గా ఉందని అభినందిస్తూ, వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మహిళల సత్తా

**- యారబాడులో శ్రీరామాలయ ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా నిర్వహణ**

**నరసన్నపేట, ఫిబ్రవరి 20(వార్త):** యారబాడు గ్రామంలో శ్రీరామాలయ ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలను గురువారం నిర్వహించారు. గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. పురుషుల విభాగంలో గేదెల సత్యనారాయణ ప్రథమ బహుమతి, ఆవాల గోవిందరావు ద్వితీయ బహుమతి సాధించారు. మహిళల విభాగంలో దూబ హేమశ్రీ ప్రథమ స్థానం, తాలాడ కావ్య ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. మహిళలు ధైర్యంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడం విశేషంగా నిలిచింది. విజేతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు, యువత, భక్తులు విజేతలను అభినందించారు. గ్రామోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగాయి.



# గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

**- పోతయ్య వలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చైతన్య కార్యక్రమం**

**నరసన్నపేట, ఫిబ్రవరి 20(వార్త):** బాలికలపై లైంగిక వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తున్నట్లు ప్రైవేట్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండలం పోతయ్య వలస ప్రాథమిక పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు తమపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఇటువంటి ఘటనలపై ఫోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమణమూర్తి పాల్గొని విద్యార్థులకు ధైర్యం నూరిపోశారు. చిన్నారుల భద్రత కోసం సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రభుత్వ పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 20(వార్త):** పదవీ విరమణ పొంది పింఛను తీసుకుంటున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పించన దారులు తమ యొక్క లైఫ్ సర్టిఫికెట్స్ ని ఈ నెల అంటే 28 ఫిబ్రవరి 2026 తేదిలోగా సమర్పించాలని ఆమదాలవలస ఉప ఖజానా అధికారి బట్న క్రిష్ణారావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా 87 మంది పించనదారులు తమ యొక్క లైఫ్ సర్టిఫికెట్స్ ని ఇంకా సమర్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాలు మేరకు లైఫ్ సర్టిఫికేట్ ను జీవన్ ప్రమాణం ద్వారా గాని, నెట్ సెంటర్ లో గాని లేదా మీకు దగ్గరగా వున్నా ఆంధ్ర ప్రదేశ్ లో ఏ జిల్లా ట్రెజరీ లో గాని, ఏ సబ్ ట్రెజరీ లో గాని జీవన్ ప్రమాణం ద్వారా లైఫ్ సర్టిఫికేట్ ను సమర్పించవచ్చునని తెలియజేసారు. అలాగే ఎవరైనా ఆరోగ్య సమస్యలు కారణంగా గాని, వృద్ధాప్యం వలన గాని బయోమెట్రిక్ పడని వారు కానీ లేదా జీవన్ ప్రమాణం ద్వారా లైఫ్ సర్టిఫికేట్ పడని వారు ఎవరైనా వుంటే అటువంటివారు ఉప ఖజానా అధికారి, ఆమదాలవలస వారికి తెలియపరిస్తే, సంబందిత సిబ్బందిని వారి ఇంటికి పంపించి వారి వద్ద నుండి ఫిజికల్ గా లైఫ్ సర్టిఫికేట్ ను తీసుకొంటారని తెలిపారు. అలాగే జి.ఓ. నెంబర్ 315 ద్వారా పెన్షన్ అందుకుంటున్న పించన్ దారులు వారు స్వయంగా సంబందిత ట్రెజరీ కి వచ్చి దానికి సంబందించిన పత్రాలుతో లైఫ్ సర్టిఫికేట్ ను సమర్పించవలసినదిగా కోరియున్నారు.

# శిథిలావస్థ పాఠశాలలను పునర్నిర్మించండి



**-ప్రభుత్వానికి ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి విన్నపం**

**-అసెంబ్లీలో ప్రస్తావన**

**జలుమూరు, ఫిబ్రవరి 20(వార్త):** శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను తక్షణమే పునర్నిర్మించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి శాసనసభలో కోరారు. శుక్రవారం జీరో అవర్ సందర్భంగా ఆయన సభలో మాట్లాడారు. తన నియోజకవర్గం పరిధిలో మొత్తం 25 ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిలో 14 పాఠశాల భవనాలు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయని వివరించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రికి ఇప్పటికే సమగ్ర నివేదిక సమర్పించామని, సమస్య తీవ్రతను గుర్తించి త్వరితగతిన నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని సభలో విన్నవించారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంలో విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## వెనుకబడిన వర్గాల సాధికారతతోనే సామాజిక న్యాయం

**-డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 20(వార్త):** సమాజంలోని నిర్మాణాత్మక అసమానతలను సరిదిద్ది, వ్యక్తులందరికీ చట్టపరమైన సమానత్వాన్ని అందించడమే సామాజిక న్యాయం ముఖ్య ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. శుక్రవారం సింగుపురం గ్రామంలో 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం' పురస్కరించుకుని న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాలుగా కొనసాగుతున్న వివక్షను తొలగించి, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడైనా అసమానతలు చోటుచేసుకున్నా లేదా అర్హులైన వారికి ఫలాలు అందకపోయినా.. బాధితులు తక్షణమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని హరిబాబు సూచించారు. అటువంటి వారికి సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందించి, వారికి దక్కాల్సిన హక్కులను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. న్యాయ సేవాధికార సంస్థ చేపడుతున్న వివిధ ప్రజాహిత పథకాలను గ్రామస్తులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎం. శ్యామ్ సుదర్శన రావు, ఇతర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 28న సైన్స్ దినోత్సవం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 20(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సైన్స్ సమగ్రా మహోత్సవం- 2ఖ26 అను కార్యక్రమాన్ని జాతీయ సైన్స్ దినోత్సవం ఈ నెల 28వ తేదీన ఉన్న సందర్భంగా స్కూల్, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కూర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయునది ఏమనగా, ఈ జాతీయ సైన్స్ డే ను పురష్కరించుకొని ఈ https://www.sciencesamagra.in వెబ్సైట్ నందు ఆసక్తిగల 6 వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ యొక్క ప్రాజెక్టులను ఆన్లైన్లో నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం పైన తెలుపబడినటువంటి వెబ్సైట్ చూడాలని తెలిపారు.

Science City of Andhra Pradesh

## ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- ఏప్రిల్ 12న కరవంజ ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష**



**జలుమూరు, ఫిబ్రవరి 20(వార్త):** కరవంజలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 30వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ రుసుము రూ. 200 కాగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 125 మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## మేజిస్ట్రేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 20(వార్త):** ఉమ్మడి జిల్లాలోని టెక్కలి, రాజాం, శ్రీకాకుళం (ఎక్సైజ్ కోర్టు) కేంద్రాల్లో ఖాళీగా ఉన్న రెండో తరగతి ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టుల భర్తీకి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ. 45,000 గౌరవ వేతనంతో పాటు రూ. 5,000 వాహన భత్యం కలిపి మొత్తం రూ. 50,000 వేతనంగా చెల్లించనున్నారు. ఐదేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదులు, రిటైర్డ్ జ్యుడీషియల్ అధికారులు లేదా గతంలో మేజిస్ట్రేట్ అధికారాలు నిర్వహించి లా డిగ్రీ కలిగిన విశ్రాంత గెజిటెడ్ అధికారులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అర్హులైన అభ్యర్థులు 45 ఏళ్ల నుండి 65 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఆసక్తి ఉన్నవారు నిర్ణీత దరఖాస్తు ఫారమ్‌ను జిల్లా కోర్టు అధికారిక వెబ్‌సైట్ https://srikakulam.dcourts.gov.in/ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధృవీకరణ పత్రాలతో జతపరిచి, మార్చి 17, 2026 సాయంత్రం 5 గంటలలోపు 'జిల్లా ప్రధాన న్యాయమూర్తి, శ్రీకాకుళం' వారికి రిజిస్టర్డ్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని అధికారులు స్పష్టం చేశారు.



# 15 రోజుల్లో రూ.4.14 లక్షల హుండీ ఆదాయం

**శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహణ**

**జలుమూరు, ఫిబ్రవరి 20(వార్త):** దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలో ఉన్న శ్రీ ముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలోని ధర్మ హుండీలను శుక్రవారం తెరిచి లెక్కింపు నిర్వహించారు. గత 15 రోజుల కాలానికి గాను రూ.4,14,818/- హుండీ ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. మహాశివరాత్రి ఉత్సవాల అనంతరం ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో హుండీ ఆదాయం గణనీయంగా నమోదైంది. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపునకు ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, ఆలయ అర్చకులు, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు మరియు సిబ్బంది హాజరయ్యారు. సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు పర్యవేక్షణకు మందస గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎస్. నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి కె. ఏడుకొండలు పాల్గొన్నారు. అదేవిధంగా, మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆదాయ వివరాల ప్రకారం ప్రత్యేక దర్శనం టికెట్లు ద్వార 2,40,520/-, కేశకండన టికెట్లు ద్వార 2,160/- , ఇతర ఆదాయాలు, హుండీ ద్వారా 4,88,418/- మొత్తం కలిపి రూ.7,31,098/- ఆదాయం నమోదైనట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

# దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌కు 13 అర్జీలు

**-అర్జీల పరిష్కారంలో జాప్యం జరగరాదు**

**-డి.ఆర్.డి.ఎ పి.డి. కిరణ్‌కుమార్**


**శ్రీకాకుళం, ఫిబ్రవరి 20(వార్త):** దివ్యాంగుల అర్జీల పరిష్కారంలో జాప్యం జరగరాదని డి.ఆర్.డి.ఎ, పి.డి. కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ , డి.ఆర్.డి.ఎ, పి.డి. కిరణ్ కుమార్ మరియు వికలాంగుల సంక్షేమ శాఖ,ఎ.డి. బి.శైలజ, ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రీవెన్స్ లో 13 దరఖాస్తులు స్వీకరించారు. అందులో వికలాంగ పింఛన్లు మంజూరు కోరుతూ 8, దరఖాస్తులు, బ్యాటరీ వెయికల్స్ మంజూరు చేయాలని కోరుతూ 2 దరఖాస్తులు, సదరం సర్టిఫికెట్ కోరుతూ 1 దరఖాస్తు, ఉద్యోగ ఉపాధి కల్పించమని కోరుతూ 1 దరఖాస్తు మరియు పి .యం. కిసాన్ 1 దరఖాస్తు వచ్చినట్లుగా తెలియజేశారు. ఈ సందర్భంగా డి ఆర్. డి. ఎ, పి .డి . కిరణ్ కుమార్, మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డి. ఆర్. డి. ఎ, పి. డి .కిరణ్ కుమార్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎ.డి. బి.శైలజ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తప్పిదాలు లేకుండా రీ సర్వే నిర్వహించాలి

**- రైతులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు -ఎండీ జ్యోత్స్న**




**జలుమూరు, ఫిబ్రవరి 20(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని ఆ శాఖ ఎండీ జోష్న సూచించారు. గురువారం జలుమూరు మండలం రాణ సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఏ ఒక్క రైతు నుండి కూడా ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, భూ వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం భూ రికార్డులను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్. పుష్పలత, సర్వేయర్ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల ఢీ

**-కంబకాయ కూడలిలో ప్రమాదం..**

**-ఫ్లెక్సీలే కారణమంటూ స్థానికుల ఆవేదన**



**నరసన్నపేట, ఫిబ్రవరి 20(వార్త):** నరసన్నపేట-కంబకాయ కూడలి వద్ద శుక్రవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. మలుపు తిరిగే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం స్పష్టంగా కనిపించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. రోడ్డుపై ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు దృశ్యాన్ని అడ్డుకుంటున్నాయని, అందువల్ల తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై పోలీస్ అధికారులు, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మధ్యాహ్న భోజన పథకంపై ఎంఈవో సమీక్ష

**- వెంకటాపురం పాఠశాలలో విద్యార్థులతో ముచ్చట్లు**



**సారవకోట, ఫిబ్రవరి 20(వార్త):** వెంకటాపురం గ్రామంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ రావు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు సమయానికి, నాణ్యమైన ఆహారం అందుతున్నదా లేదా అన్న విషయాన్ని ఆయన విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వంటశాలను సందర్శించి భోజన నాణ్యత, పరిశుభ్రత, మెను అమలు వంటి అంశాలను సమీక్షించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులు లేదా అధికారులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు.

# రాంపురం, నారాయణపురంలో రూ.2.62కోట్లతో బీటీ రోడ్లు

**-కృతజ్ఞతలు తెలిపిన కూటమి నాయకులు, ప్రజలు**

**మందస, ఫిబ్రవరి 20(వార్త):** ఉద్దానంలోని నారాయణపురం, రాంపురం పంచాయతీలకు బీటి రోడ్లు నిర్మాణాలకు రూ.2.62కోట్లు మంజూరైనట్టు కూటమి నాయకులు తెలిపారు. ఈ పంచాయతీలకు సంబంధించి ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేసిన పలాస శాసన సభ్యురాలు ఎమ్మెల్యే గౌతు శిరీషకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అధ్యక్షతన నారాయణపురం, రాంపురం పంచాయతీల కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొన్నేళ్లుగా ఈ బీటీ రోడ్డు గురించి ఎన్నిసార్లు అడిగినా, అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ చెప్పుకుంటూ రావడమే తప్పా చేసింది మాత్రం ఏం లేదంటూ వాపోయారు. సోషల్ మీడియా, ఇతరేతర మాధ్యమాల్లో కూటమి ప్రభుత్వంపై దురుసుగా మాట్లాడి, జనాలను మభ్య పెట్టేలా చేయడం సరి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు తారు రోడ్లు మంజూరు చేయడంపై ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మందస మండల టీడీపీ కార్యదర్శి సాలిన మాధవరావు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు, జానకిరావు, లబ్బ రుద్రయ్య, నవీన్ యాదవ్, రట్టి లింగరాజు, ధనుంజయ తమ్మినేని, చంద్ర శేఖర్ సవర, ఈశ్వరరావు అడ్డీ, పంచాయతీ అధ్యక్షుడు జనార్ధన మల్లెన, బొంగు దామోదర్ రావు, గజ్జి తులసయ్య, రెయ్యి రాజు, మడియ ధర్మారావు, టి.మహేష్, బి.మోహన్, జి.దుర్యోధన, మడియా దమయంతి, బొడ్డు రత్నాలు, కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546